# బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



కరీంనగర్: మార్నింగ్‌వాక్‌లో నగరవాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎప్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

- బీజేపీ, కాంగ్రెస్‌తో ఒరిగేదేమీ లేదు
- ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ప్రాజెక్టులను ఎడారిగా మార్చి రైతుల నోట్లో మట్టికొడుతరా..?
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 24: 'బీఆర్ఎస్ హయాంలోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగింది. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయి. అటు డబుల్ ఇంజిన్ సర్కారు అని చెప్పుకునే బీజేపీ, ఇటు మాటలతో కోటలు కట్టే కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యం. ఆ పార్టీలతో ఒరిగేదేమీ లేదు' అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని సప్తగిరి కాలనీలో గల మానేరు వాకింగ్ ట్రాక్‌లో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రచారం చేశారు. ఎల్ఎండీలో నీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎంపీ ఎన్నికల్లో కరీంనగర్ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకువచ్చిన ఘనత వినోద్ కుమార్‌కే దక్కుతుందన్నారు. మానేరు తీరం లో వాకింగ్ ట్రాక్‌ను అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. కరీంనగర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నగరవ్యాప్తంగా 14 వాకింగ్ ట్రాక్ లు ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్‌లో ప్రజల పక్షాన కొట్లాడి నిధులు తీసుకొచ్చేందుకు పోరాటం చేసే ఎంపీలు ఉండాలన్నారు. ఇప్పటికే నగరానికి మానేరు రివర్ ఫ్రంట్‌తో పాటు టీటీడీ ఆలయం నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు తీసుకొచ్చామన్నారు. అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని సూచించారు.

### రైతు రాజ్యమని చెప్పి రైతులను ఏడిపిస్తరా..?:

**- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్**

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నదని, మేడిగడ్డ బరాజ్ పిల్లర్లను సాకుగా చూసి ప్రాజెక్టులను ఎడారిగా మార్చి రైతుల నోట్లో మట్టికొడుతున్నదని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతురాజ్యం తెస్తామన్న కాంగ్రెస్, అధికారంలోకి రాగానే రైతులను కన్నీరు పెట్టిస్తోందని ధ్వజమెత్తారు. గోదావరిలో రోజుకు 5వేల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదని, అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో 50 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోయిందన్నారు. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే మేడిగడ్డలో కుంగిన పిల్లర్ల వద్ద కాపర్ డ్యాం నిర్మించి, నీటిని ఎత్తిపోస్తే ఇప్పుడీ సాగునీటి సమస్యలు వచ్చేవికాదన్న వినోద్, పూర్తిగా వారి అసమర్థతతోనే యాసంగి పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. ప్రాజెక్టులను గాలికివదిలేయడంతో సాగునీటి కరువే కాదు కరీంనగర్ నగరవాసులు తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఐదేళ్లలో బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధి కోసం ఏం చేశాడని..? ఇప్పుడు ప్రజలను ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. ఒక్క గుడి తేలేదని, ఒక్క నవోదయ పాఠశాల తేలేదని, వేములవాడ, కొండగట్టు ధర్మపురి, కాళేశ్వరం ఆలయాల అభివృద్ధి కోసం నయాపైసా నిధులు తేలేదని విమర్శించారు. గంగుల కమలాకర్‌తో కలిసి తాము అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దగ్గరకు వెళ్లి కరీంనగర్‌లో టీటీడీ ఆలయం నిర్మాణం కోసం రూ.25 కోట్లు మంజూరు చేయించి, పనులు ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎంపీగా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి దాకా రైల్వేలైన్ మంజూరు చేయించానని, నాలుగు జాతీయ రహదారులు తీసుకువచ్చినట్లు చెప్పారు. కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్పించి వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసి చూపిస్తానని, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మానేరు వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆనందం, నర్సింగరావు, విద్యాసాగర్ రెడ్డి, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, మహేశ్, ఐలేందర్, తోట రాములు, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ నాయకులు ఏవీ రమణ, జక్కుల నాగరాజు యాదవ్, శ్రీకాంత్, దూలం సంపత్ గౌడ్, రవినాయక్, కర్ర సూర్యశేఖర్, సాయి, శ్రీవారి పాల్గొన్నారు.



కొనుగోలుదారుకు వాహనం అందజేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో మహేశ్వర్‌కుమార్



వాహనాలను పరిశీలిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో మహేశ్వర్‌కుమార్

ఆటో షోలో వాహనాలను తిలకిస్తున్న సందర్శకులు

# ఆటో షో.. గ్రాండ్ సక్సెస్

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వినియోగదారులు
- ఆఖరి రోజు ఆకట్టుకునేలా బుకింగ్స్
- సాంస్కృతిక నృత్యాలతో అలరించిన చిన్నారులు
- ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, ఆర్డీవో మహేశ్వర్

**ఆటో ఎక్స్‌పో గ్రాండ్ సక్సెస్ అయింది. కరీంనగర్ జిల్లావాసులకు ఎంతో దోహదపడింది. జిల్లా కేంద్రంలోని సర్కస్ గ్రౌండ్ వేదికగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన షో, ఆదివారం సాయంత్రం క్లోజ్ కాగా, వినియోగదారుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఆఖరిరోజు నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావమే కాదు.. అదే స్థాయిలో తమకు నచ్చిన వాహనాలను బుకింగ్ కూడా చేసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో మహేశ్వర్ నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే యాజమాన్యాలను అభినందించారు. వాహన ప్రియుల కోసం ఒకే దగ్గర అన్ని రకాల వాహనాలు అందుబాటులోకి తీసుకురావడం చాలా గొప్ప అలోచన అని కొనియాడారు.**

**- కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మార్చి 24**

### వాహన ప్రియులకు మంచి అవకాశం..



వాహన ప్రియుల కోసం అన్ని వాహనాలను ఒకే దగ్గరికి తీసుకురావడం మంచి అవకాశం. ఇందుకు నమస్తే తెలంగాణ బాధ్యతాయుత కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి పరిణామం. ప్రతి రోజూ అనేక రకాల వార్తా కథనాలతో ప్రజల్లో ఉండే పత్రిక, ప్రజల సౌకర్యాల కోసం మారుతి నుంచి మెర్సిడెజ్ దాకా అన్ని రకాల కంపెనీల వాహనాలను, రుణాలు ఇచ్చే బ్యాంకులను సైతం అందుబాటులో ఉంచాలనే ఆలోచన చాలా మంచిది. ఇలాంటి కార్యక్రమాలు రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహించాలి. జిల్లా వాసులు హైదరాబాద్, వరంగల్ లాంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వాహనాలు కొనుగోలు చేసేలా చూడాలి.

**- కొండూరి రవీందర్ రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్**

### అన్ని వాహనాలు ఒకే చోట..



కరీం'నగరంలోని' సెంటర్ ఆఫ్ సిటీలో నమస్తే తెంగాణ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామం. మార్కెట్‌లో ఉన్న కొత్త వాహనాలతోపాటు ఎక్స్ఛేంజ్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం సంతోషించదగ్గ విషయం. ఒక కంపెనీ షోరూంకు పోయి ఒక వాహనాన్ని చూడగలం కానీ, అన్ని రకాల కంపెనీల వాహనాలు అందుబాటులోకి తెచ్చిన నమస్తే తెలంగాణకు ప్రత్యేక అభినందనలు. ఇక్కడ ఉన్న వాహనాలు ఒకదానికి ఒకటి పోటీ అన్నట్లుగా ఉన్నాయి. వాటి గురించి వచ్చే సందర్శకులకు వివరించి, వారి అవసరం మేర వాహనాలు అందించేలా ఏర్పాట్లు బాగున్నాయి. ఇక్కడ ఇన్ని కంపెనీల వాహనాలు, వాటి కోసం తరలివచ్చిన సందర్శకులను చూస్తుంటే సంతోషంగా ఉంది.

**- కే మహేశ్వర్, కరీంనగర్ ఆర్డీవో**



బహుమతి పొందిన విజేతకు గిఫ్ట్‌ను అందజేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో మహేశ్వర్‌కుమార్

ఆటో ఎక్స్‌పో అట్టహాసంగా సాగింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే (సర్కస్) గ్రౌండ్ వేదికగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన వాహన షో గ్రాండ్ సక్సెస్ అయింది. ఆదివారం ముగింపు కార్యక్రమానికి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై వాహన మోడల్స్‌ను పరిశీలించారు. ఈ షోకు మెయిన్ స్పాన్సర్ ఆదర్శ ఆటో మోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అసోసియేట్ స్పాన్సర్లుగా మహవీర్ గ్రూప్ మెర్సిడిస్ బెంజ్, ఆడి హైదరాబాద్, వోల్వో, మహవీర్ ఐసుజు, ప్రైడ్ జీప్, గ్రీన్ హోండా, మోటార్ లైన్ మహీంద్ర డీలర్, క్వాంటం ఈ-స్కూటర్స్, కాకతీయ టయోటా, మారుతి సుజుకి, నెక్సా, మారుతి సుజుకి ఎరేన, ఆదర్శ ట్రూ వాల్యూ, మాలిక్ కియా, హబురా సుజుకి సంస్థలతోపాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు ఇతర సంస్థలు పాల్గొనగా, వాటి వివరాలు తెలుసుకున్నారు. ముగింపు వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలభవన్ సంగెం రాధాకృష్ణ బృందం చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత కంపెనీ ప్రతినిధులకు, బాలబాలభవన్ చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షోలో నమస్తే తెలంగాణ కరీంనగర్ యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జిలు ఐ సుభాష్, వీ సంపతి, స్టాఫర్ దొంత వెంకటస్వామి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బాలకిషన్‌రావు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, టెక్నికల్ ఇన్‌చార్జి రామకృష్ణ, హెచ్ఆర్ ఇన్‌చార్జి శ్రీలత, స్టోర్ ఇన్‌చార్జి రవి, అకౌంటెంట్ రాజేందర్, నమస్తే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నృత్య శిక్షకుడు సంగెం రాధాకృష్ణకు బహుమతి అందజేస్తూ..



నృత్యం చేస్తున్న బాలభవన్ విద్యార్థులు



నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో మహేశ్వర్‌కుమార్

### ఆదివారం సందర్శకుల తాకిడి

ఆటోషో చివరి రోజు ఆదివారం కావడంతో జ్యోతిబా పూలే మైదానం ఉదయం నుంచే వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. సాయంత్రం సమయంలో పెద్ద సంఖ్యలో నగరవాసులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. వాహనాల ధర, మైలేజ్, ఎన్ని రోజుల్లో డెలివరీ చేస్తారు..? ఈ షో ద్వారా ఎంత రాయితీ ఇస్తారు..? ఇలా వివరాలు తెలుసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. పలువురు తమకు నచ్చిన వాహనాన్ని టెస్ట్ డ్రైవ్ చేయగా, మరొకొందరు ఫొటోలు దిగుతూ కనిపించారు.



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారికి బహుమతి అందజేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆర్డీవో మహేశ్వర్‌కుమార్



స్టాల్స్ ప్రతినిధులకు బహుమతులు అందజేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, ఆర్డీవో మహేశ్వర్‌కుమార్



జగిత్యాల: కంటి ఆపరేషన్లు చేసిన వారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

### ఉచిత కంటి ఆపరేషన్లు చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల, మార్చి 24: జిల్లా కేంద్రంలోని జగిత్యాల పావని కంటి దవాఖాన, ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 17 మంది పేదలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్స చేశారు. ఆదివారం ఉదయం రోగుల కండ్ల ను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకుడు ఆనంద్‌రావు, దవాఖాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టులో గిరి ప్రదక్షిణ

మల్యాల, మార్చి 24: కొండగట్టు ఆలయ పరిసరాల చుట్టూ గల కొండచుట్టూ ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. శనివారం చిలుకూరు ఆలయ పూజారి ఆత్మరాం సురేశ్ మహారాజ్ నేతృత్వంలో కొండగట్టు దిగువన గల ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి 100మంది దీక్షాపరులు, భక్తులతో ప్రారంభమైన గిరిప్రదక్షిణ దొంగలమర్రి, నాచుపల్లి క్రాస్‌రోడ్, డబ్బుతిమ్మయ్యపల్లి, రాంసాగర్, మద్దుట్ల, రామన్నపేట, నూకపల్లి, మల్యాల ఎక్స్‌రోడ్ మీదుగా సుమారు 25 కిలోమీటర్ల మేర కొనసాగి కొండగట్టుకు చేరుకున్నది. మద్దుట్లలో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొని భోజన విరామ సమయంలో భక్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వినోద్‌కు అర్చకులు ఆశీర్వచనం చేసి సత్కరించారు.



మద్దుట్లలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

## కనుల పండువగా తెప్పోత్సవం

ధర్మపురి పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మపుష్కరిణి(కోనేరు)లోయోగా నృసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. మొదట ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించిన సేవపై మేళతాళాల మధ్య కోనేరు వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కోనేరులో అప్పటికే అలంకరించిన హంస వాహనంపై ఆసీనులను చేసి కోనేరులో చుట్టూ భక్తుల గోవిందనామ స్మరణల మధ్య ఐదు ప్రదక్షిణలు చేశారు. అనంతరం కోనేరు మధ్యలో గల మండపంలోని ఊయలలో స్వామివార్లను ఉంచి పండితులు మంత్రోచ్ఛారణల మధ్య డోలోత్సవం నిర్వహించారు.

**- ధర్మపురి, మార్చి 24**

